

పటాన్‌చెరు: ఓటుహక్కును వినియోగించుకున్న కాటా శ్రీనివాస్‌గౌడ్



వట్‌పల్లి: కుటుంబ సభ్యులతో కలిసి సిరా చూపుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



మునిపల్లి: తాటిపల్లిలో బారులు తీరిన ఓటర్లు

క్లుప్తంగా

భవనంపై నుంచి పడి మహిళకు గాయాలు

పటాన్‌చెరు టౌన్: నిర్మాణ దశలో ఉన్న భవనానికి నీటిని పడుతూ మొదటి అంతస్తుపై నుంచి పడి మహిళకు గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన గణేష్ భార్య సంగీతతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండల పరిధదిలోని ఇంద్రేశం సిటిజన్ కాలనీలో ఉంటున్నారు. ఈ క్రమంలో సంగీత సోమవారం ఉదయం వీరు నిర్మిస్తున్న ఇంటి మొదటి అంతస్తులో గోడలకు నీటిని పడుతూ ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడింది. దీంతో కాలు విరిగి తీవ్ర గాయమైంది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మాజీ సర్పంచ్‌పై కేసు

పటాన్‌చెరు టౌన్: ఓటర్లకు డబ్బు పంపిణీ చేసిన మాజీ సర్పంచ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుర్మ మల్లేశం ఐలాపూర్ గ్రామంలోని పోలింగ్‌స్టేషన్ వద్ద ఓటర్లకు డబ్బు పంచుతున్నట్టు వీడియో వైరల్ అయింది. దీంతో సహాయక ఎన్నికల అధికారి దేవుజా ఆదేశాల మేరకు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్-2 అధికారి హరిశంకర్‌గౌడ్ కుర్మ మల్లేశంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షంతో ఇబ్బందులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో చేతికి వచ్చిన వరిపంటలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యం బస్తాలు వర్షంతో తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తడిసిన ధాన్యంను ప్రభుత్వమే కొనుగోలు చేసి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. ఈదురు గాలులకు ఆయా గ్రామాల్లో రేకులు ఎగిరిపోయాయి.

పోలింగ్ కేంద్రాల్లో ఆకట్టుకున్న సెల్ఫీస్టాండ్లు

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో మోడల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్లు ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. మోడల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసిన ఓటర్లు గర్వంగా ఓటు వేసినట్లు సెల్ఫీలు దిగడం కోసం ప్రత్యేకంగా ప్రౌడ్ టూబీ ఓటర్, ఐఓటర్ టుడే అనే బాక్సును ఏర్పాటు చేయడమే కాకుండా గ్రీనరీ బ్యాక్‌గ్రౌండ్‌తో సెల్ఫీ దిగడానికి సెల్ఫీ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. వేసవికాలం కావడంతో ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా చల్లని తాగునీరు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. సోమవారం ఎండ తీవ్రత అంతంత మాత్రంగానే ఉండడంతో అధికారులు, ఓటర్లు ఊపిరి పీల్చుకున్నారు.

రెమ్యునరేషన్ కోసం ఆందోళన

నారాయణఖేడ్: ఎంపీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు చెల్లించాల్సిన బత్యం తక్కువగా ఇస్తున్నారంటూ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. నారాయణఖేడ్ మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్నిల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులు ముగించుకొని సోమవారం రాత్రి ఈవీఎంలు, వీవీప్యాట్, ఇతర సామగ్రితో తిరిగి వచ్చిన ఉద్యోగులు సంబంధిత కేంద్రాల్లో వాటిని అధికారులకు అప్పగించారు. అనంతరం ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బత్యం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకంగా ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఇక్కడ తక్కువగా ఇస్తున్నారని ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న ఉద్యోగులను చెదరగొట్టారు. కొద్దిసేపు రిసీవింగ్ పాయింట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది.

పోలింగ్ ప్రశాంతం

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల బారులు
- పోలీసు బందోబస్తు మధ్యన ఎన్నికలు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎంపీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ఏర్పాటు చేసిన 59 పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. హత్నూర మండల కేంద్రంలో 223 పోలింగ్ బూత్‌లో 30 నిమిషాల పాటు ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు కొంతసేపు ఇబ్బందులకు గురయ్యారు. చిక్ మద్దూర్, పల్పనూర్, గుండ్లమాచునూరు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులను అడిగి పోలింగ్ సర్వేను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆయా గ్రామాలను సందర్శించి కాంగ్రెస్ నాయకులను పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల అధికారితో వాగ్వాదం

హత్నూర మండల పరిధిలోని షేర్‌ఖాన్ పల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వెళ్లిన వృద్ధులకు పోలింగ్ అధికారి నీలం రంగు బటన్‌పై మొత్తాలని సూచించడంతో అక్కడే ఉన్న కొంతమంది ఏజెంట్లు అధికారితో ఘర్షణ దిగారు. నీల మధుకు ఓటు వేయాలని ఎలా సూచిస్తావని అధికారిపై మండిపడ్డారు. దీంతో స్పందించిన ఎన్నికల అధికారి తాను నీలం మధుకు వేయాలని చెప్పలేదు నీలం రంగు బటన్‌పై ఒత్తాలని సూచించానే తప్ప ఓటు ఎవరికీ వేయమని చెప్పలేదని సమాధానం ఇవ్వడంతో చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. అయినప్పటికీ స్థానికులు కొంతమంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జహీరాబాద్ నియోజకవర్గంలో...

జహీరాబాద్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. ఓటర్లు ఓటు వేసేందుకు ఉత్సాహంగా తరలివచ్చారు.

కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట్ మండలాల్లో...

కల్హేర్(నారాయణఖేడ్): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట్ మండలాల్లో ఓటర్లు బారులు తీరారు. కల్హేర్ మండల పరిధిలోని ఖానాపూర్(కె)లో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. మార్డిలో ఆల్‌ఇండియా ఫార్వర్డు బ్లాక్ అభ్యర్థి ఎన్ఆర్ఐ గుర్రపు మశ్చేందర్ వేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు.

మొరాయించిన వీవీ ప్యాడ్



హత్నూర: పోలింగ్ సరళిపై బీఆర్‌ఎస్ నాయకులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడి

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలోని 278 ఎన్నికల బూత్‌లో వీవీ ఫ్యాడ్స్ మోచాయించింది. దీంతో వెంటనే స్పందించిన అధికారులు మరో వీవీ ఫ్యాడ్‌ను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆటోలలో వృద్ధులు, వికలాంగులు వెళ్లి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పోతులబోగుడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 29వ పోలింగ్ కేంద్రంలో సోమవారం అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేయడాన్ని బాధ్యతగా భావించాలి

పటాన్‌చెరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వేయడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాటా సుధారాణి అన్నారు. అమీన్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన కార్పొరేటర్

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో విద్యాభారతి స్కూల్ పోలింగ్ కేంద్రంలో కార్పొరేటర్ కుమార్‌యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో ఎంపీపీ తొంట యాదమ్మ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా జెడ్పీటీసీ గడీల శ్రీదేవి కంబాలపల్లి గ్రామంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం ఆరు గంటలకు క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అవకాశం కల్పించారు.

ఓట్లు పెరిగినా.. తగ్గిన పోలింగ్ శాతం

కంగ్టి (నారాయణఖేడ్): మండలంలోని 43 పోలింగ్ బూత్‌లలో 70.97 శాతం పోలింగ్ నమోదైంది. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో 34,349 ఓటర్లు ఉండగా 83.26 శాతం మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ ఈసారి పోలింగ్ సమయంలో ఒక్క గంట ఎక్కువ సమయం ఇచ్చినా పోలింగ్ శాతం 12.29 శాతం తగ్గింది. గతంలో కంటే 1460 మంది ఓటర్లు ఎంపీ ఎన్నికల్లో పెరిగారు. 35,939 మంది ఓటర్లకు గాను 25,506 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి

పటాన్‌చెరు: ప్రతిఒక్కరూ ఓటు ప్రాధాన్యతను గుర్తించాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పారిశ్రామిక వాడల్లో పోలీసు బందోబస్తు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో చెదురుమదురు ఘటనల మినహా సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బొల్లారం, బొంతపల్లి, ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక వాడల్లో పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఇతర రాష్ట్రాలకు వెళ్లటంతో కొంతమేర పోలింగ్ శాతం తగ్గింది. ఆయా గ్రామాల్లో ఓటర్లు బారులు తీరారు. గడ్డపోతారంలో పోలింగ్ సరళిని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు పరిశీలించారు. అన్నారం, బొంతపల్లి, గుమ్మడిదలలో పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు.

ప్రశాంతంగా ఎన్నికలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. రామచంద్రాపురం పట్టణంలోని ఐటీఐ పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర శాసనమండలి మాజీ ప్రోటెమ్ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. తెల్లాపూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత, ఈదులనాగులపల్లిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. రామచంద్రాపురం పట్టణంలో కార్పొరేటర్‌లు పుష్ప, సింధురెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



ఝరాసంగం: ఓటుహక్కు వినియోగించుకున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సునితాపాటిల్

కొండాపూర్ మండల పరిధిలో...

కొండాపూర్(సంగారెడ్డి): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఎంపీపీ మనోజ్‌రెడ్డి తన స్వగ్రామమైన మారేపల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. జెడ్పీటీసీ పద్మావతి పాండురంగం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్ మల్లెపల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభు తొగర్‌పల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కంది మండలంలో...

కంది(సంగారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాల్లో 42 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మండలంలో 35,876 మంది ఓటర్లు ఉండగా 65 శాతం పోలింగ్ నమోదైంది. 61వ పోలింగ్‌స్టేషన్‌లో ఈవీఎం మొరాయించింది.ఆ తర్వాత ఈవీఎంను సరి చేయడంతో పోలింగ్ ప్రారంభమైంది.

సదాశివపేటలో పోలింగ్ ప్రశాంతం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని రవీంద్రమాడల్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తన అనుచరులతో వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణపాటిల్ కుటుంబసభ్యులతో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు

జహీరాబాద్: ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఈదులపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి చిరాగ్‌పల్లిలో ఓటు వేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి మల్‌చల్మ గ్రామంలో ఓటు వేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం పస్తాపూర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్ జహీరాబాద్ పట్టణంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.



ఓటుహక్కును వినియోగించుకున్న గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి, పెద్దచల్మెడ, కల్లపల్లి బేలూర్, పెద్దలోడి, లింగంపల్లి తదితర గ్రామాల్లో ఓటర్లు బారులు తీరారు. తాటిపల్లిలో రెండుసార్లు వీవీ ఫ్యాట్లు మొరాయించారు. అనంతరం వీవీ ఫ్యాట్లు ఏర్పాటు చేయడంతో మళ్లీ ఓటింగ్ ప్రారంభమైంది.

న్యాల్‌కల్ మండలంలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో మొత్తం 48,163 మంది ఓటర్లు ఉండగా అందులో 36,363 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. వృద్ధులు, వికలాంగుల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జహీరాబాద్ నియోజకవర్గంలో 71.91శాతం పోలింగ్ నమోదు

జహీరాబాద్: జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల్లో పోలింగ్ కేంద్రాలను బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పోలింగ్ సరళిని పరిశీలించారు. మాజీ మంత్రి చంద్రశేఖర్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి ఎన్నికల సరళిని పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డిఓటింగ్ సరళిని పరిశీలించారు.

రాయికోడ్ మండల పరిధిలో...

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎంపీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 71.76 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఓటర్లు క్యూలైన్‌లో బారులు తీరారు.

సంగారెడ్డి: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్‌కుటుంబ సమేతంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి కుటుంబ సమేతంగా స్థానిక బాలికల పాఠశాలలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.



ఎట్టిగడ్డ సంఘం గ్రామంలో ఓటు వేసిన యువకులు



జిన్నారం: బొల్లారంలో ఓటు వేసినట్లు చూపుతున్న నాయకులు, యువకులు



రామచంద్రాపురం: కుటుంబ సభ్యులతో కలసి ఓటుహక్కు వినియోగించుకున్న భూపాల్‌రెడ్డి



మల్లెపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన జనం



మునిపల్లిలో బారులు తీరిన ఓటర్లు



రాయికోడ్: ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లు



జహీరాబాద్‌లో బారులు తీరిన ఓటర్లు



సదాశివపేట: బారులు తీరిన ఓటర్లు



కందిలోని లక్ష్మినగర్‌లో ఓటర్ స్లిప్ తీసుకుంటున్న వికలాంగుడు



న్యాల్‌కల్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

100 శాతం ఉత్తీర్ణత

- సీబీఎస్ 'పది' ఫలితాల్లో భారతీయ విద్యా భవన్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ
- అభినందనలు తెలిపిన ప్రిన్సిపాల్ ఉమా



వాకటి వైష్ణవి



మయాంక్ చౌదరి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీబీఎస్ పదో తరగతి ఫలితాల్లో బీహెచ్‌ఈఎల్ కాలనీలోని భారతీయ విద్యా భవన్ పాఠశాల 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉమా తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 271 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. అందులో వాకటి వైష్ణవి 500 మార్కులకు గాను 489, మయాంక్ చౌదరి 488, ఓజస్వి మండల 486, గరిమామీనా 484, వేల్పుల కృష్ణశ్రేష్ఠ 484 ఉత్తమ మార్కులు సాధించారని ఆమె వివరించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. కాగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతోనే మంచి మార్కులు సాధించామని వైష్ణవి, మయాంక్ తెలిపారు.

అందరం మిత్రులమే..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ఎన్నికల సమయంలో ఎవరి జెండాలు వారివి, ఎవరి ప్రచారాలు వారివే కానీ ఎన్నికలు పూర్తయితే మేమందరం మిత్రులమే అంటున్నారు తెల్లాపూర్ వివిధ రాజకీయ నాయకులు. సోమవారం లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తెల్లాపూర్‌లో ఓటు వేసిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఒకచోటికి చేరి సరదాగా గడిపారు. సెల్ఫీలు దిగుతూ వాటిని సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ కనిపించారు.



ఒకే చోట వివిధ పార్టీల నాయకులు



బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు



కంగ్టి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళి పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

పోలింగ్ సరళిపై అభ్యర్థుల ఆరా



పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎంపీ అభ్యర్థి నీలం మధు

పటాన్ చెరు: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ఎన్నికలలో భాగంగా సోమవారం పటాన్‌చెరు నియోజకవర్గంలో పర్యటించారు. పటాన్‌చెరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, జీహెచ్‌ఎంసీ ఆఫీసు, మండల ప్రజా పరిషత్ ప్రైమరీ స్కూల్, ఎంపీడీవో ఆఫీస్ సముదాయం, శాంతినగర్ మంజీరా హైస్కూల్, జిన్నారం మండలం గడ్డపోతారం, జిన్నారం మండలంలోని పలు పోలింగ్ సెంటర్లను నీలం మధు సందర్శించారు.

రఘునందన్‌రావు సైతం..

పటాన్‌చెరు టౌన్: బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్ రావు ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను, అదే విధంగా బ్లాక్ ఆఫీసు ఆవరణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్లను సందర్శించారు. ఆయా సెంటర్లలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని 43 పోలింగ్ బూత్‌లలో 70.97 శాతం ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలోని తడ్కల్, కంగ్టి పోలింగ్ బూత్‌లను బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సందర్శించారు.